సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



పోటెత్తిన భక్తులు

విశాఖ: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు.



సమ్మోహనభరితం

విశాఖ: కళాకారిణుల నృత్యం సమ్మోహనపరిచింది. సంస్కృత కథక్ విద్యాలయం వార్షికోత్సవం కళాభారతిలో ఘనంగా జరిగింది.



ఆంగ్ల పుస్తకావిష్కరణ

విశాఖ: ఏయూ ఆంగ్ల విభాగం అధ్యాపకులు రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వీసీ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

నూకాలమ్మతల్లికి వెండి కిరీటం



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లికి గొలుగొండ గ్రామానికి చెందిన కుంత్సం సత్యనారాయణ కుమారులు శనివారం వెండి కిరీటం బహూకరించారు. లింగంపేటలో నాలుగు నెలల క్రితం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించి, అమ్మవారిని ప్రతిష్ఠించారు. గొలుగొండ కుంత్సం కుటుంబ సభ్యులు సుమారు 6.5 కిలోల వెండితో అమ్మవారికి వెండి కిరీటం చేయించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శనివారం నూకాలమ్మతల్లికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు, కుంత్సం కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి టౌన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత సమాచారంతో యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

టౌన్ ప్లానింగ్‌లో పలువురికి పదోన్నతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగంలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ హోదాతో పదోన్నతి కల్పించి.. జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వరరావును వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారిగా బదిలీ చేశారు. మరో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.జయరాంను విశాఖలోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. గాజువాక ఏసీపీ సంపూర్ణ మహాపాత్ర బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీకాగా, అనకాపల్లి ఏసీపీ అరుణవల్లిని రాజమండ్రి రీజినల్ డిప్యూటీ డైరక్టర్‌గా బదిలీ చేశారు. జీవీఎంసీలో టీపీవోలుగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, రామకృష్ణలకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ హోదా కల్పిస్తూ.. జీవీఎంసీలోనే పోస్టింగ్ ఇచ్చారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

- పాడె మోసిన కుమార్తెలు



అప్పారావు అంత్యక్రియల్లో పాల్గొన్న భార్య, కుమార్తెలు

మునగపాక: వారిద్దరూ అన్యోన్య దంపతులు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి జీవనం సాగించారు. ఇంతలో విధి వారి బంధాన్ని విడదీసింది. దాంతో భర్తకు భార్య తలకొరివి పెట్టి రుణం తీర్చుకోగా, భారమైన హృదయంతో తండ్రి పాడెను ముగ్గురు కుమార్తెలు మోసిన సంఘటన శనివారం మునగపాకలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెంటకోట అప్పారావు(69) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం సాయంత్రం పశువులకు గడ్డి కోసం దుకు పొలానికి వెళ్లాడు. అతడికి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఉన్నపళంగా కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న భార్య లక్ష్మి కేకలు వేయడంతో సమీప రైతులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే మృతి చెందాడు. మృతుడికి కొడుకులు లేకపోవడంతో ముగ్గురు కుమార్తెలు పాడెను మోసి తండ్రి రుణం తీర్చుకోగా, భార్య లక్ష్మి తల కొరివి పెట్టింది. ఈ సంఘటన స్థానికులను కలచివేసింది.

రైతులకు అందించే అన్ని సంక్షేమ పథకాల ఫలాలను కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 'పంట సాగుదారు హక్కు చట్టం -2019' ద్వారా రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తోంది. ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలను జారీ చేసి రికార్డు సృష్టించింది.

కౌలు రైతుకు కొండంత అండ



- జిల్లాలో రెట్టింపు స్థాయిలో సీసీఆర్‌సీ కార్డులు మంజూరు
- ఈ ఏడాది అత్యధికంగా 4240 మందికి జారీ
- రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు, రాయితీలు, రుణాల వర్తింపు

దేవరాపల్లి : రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం కొండంత అండగా నిలుస్తోంది. రైతులకు అందించే అన్ని సంక్షేమ పథకాల ఫలాలను కౌలు రైతులకు కూడా అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో భూమి యాజమాన్య హక్కులకు భంగం కలగకుండా కౌలుదారునికి నిర్ణీత కాల వ్యవధిలో పండిన పంటలపై మాత్రమే హక్కు కల్పిస్తూ 'పంట సాగుదారు హక్కు చట్టం-2019'ను తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఈ చట్టం కౌలు రైతుల పాలిట వరంగా మారింది. చట్టం కల్పించిన భరోసాతో భూ యజమానులు కౌలుకు ఇచ్చేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. కంటి తుడుపుగా గ్రామంలో తమ అనుయాయులకు ఒకరిద్దరికి కౌలుకార్డులు మంజూరు చేసి మమ అనిపించేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కౌలు రైతుల దశ మారింది. భూమి లేని సన్న చిన్నకారు నిరుపేద రైతులకు, దేవదాయ భూములు సాగు చేసుకునే రైతులకు సైతం పంట సాగుదారు హక్కు పత్రాలు జారీ చేసి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈ మేరకు రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతు గుర్తింపు గ్రామ సభలను నిర్వహించి మరీ దరఖాస్తులు స్వీకరించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన కౌలుదారులకు పంట సాగుదారు హక్కు పత్రాన్ని అందజేశారు. దీంతో జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా 4240 మంది కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలను జారీ చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది 2786 మందికి అందించారు.

పంట సాగుదారు పత్రంతో ఇవీ ప్రయోజనాలు

పంట సాగుదారు పత్రం పొందిన కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడిగా సాయంగా రూ. 13,500 ప్రభుత్వం అందిస్తుంది. పంట నష్ట పరిహారం, ఉచిత పంటల బీమా పథకం, సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది. ఈ పత్రం ద్వారా బ్యాంక్‌ల్లో పంట రుణం పొందవచ్చు. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం చెల్లించే కనీస మద్దతు ధర పొందవచ్చు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై పొందేందుకు అర్హులు.



దేవరాపల్లి మండలం పెదనందిపల్లిలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)



ప్రభుత్వం జారీ చేసిన పంట సాగుదారు హక్కు పత్రం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రెండేళ్లుగా ఎకరం భూమిని కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాను. ప్రభుత్వం రెండేళ్లుగా పంట సాగుదారు హక్కు పత్రం మంజూరు చేస్తున్నారు. దీంతో గత ఏడాది రైతు భరోసా పథకం కింద రూ. 13,500 చొప్పున నగదు జమ అయ్యింది. ఈ ఏడాది కూడా రైతు భరోసా సొమ్ము కోసం అప్‌లోడ్ చేశామని అధికారులు చెప్పారు. రైతులతో సమానంగా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలతో పాటు రాయితీలు, విత్తనాలు, ఎరువులు అందించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–సోమిరెడ్డి అమ్మతల్లి నాయుడు, కౌలు రైతు, పెదనందిపల్లి

కౌలురైతులకు వరంలా సీసీఆర్‌సీ కార్డులు



జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా 4240 మంది కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలను (సీసీఆర్‌సీ కార్డులు) అందించాం. భూమి యాజమాన్య హక్కులకు భంగం కలగకుండా కౌలుదారునికి నిర్ణీత కాల వ్యవధిలో పండిన పంటలపై మాత్రమే హక్కు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన 'పంట సాగుదారు హక్కు చట్టం-2019'తో భూ యజమానులు కౌలుకు ఇచ్చేందుకు ధైర్యంగా ముందుకువస్తున్నారు. రైతులతో సమానంగా అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలు వర్తింపజేస్తున్నాం. ఈ కార్డు ఆధారంగా బ్యాంకుల్లో పంట రుణాలు సైతం మంజూరు చేస్తున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంది.

–బి. మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి, అనకాపల్లి

28న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం

అగనంపూడి(గాజువాక): వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల నుంచి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. మిగిలిన సబ్జెక్టుల మాదిరిగానే ఇకపై వ్యాయామ అక్షరాస్యత (ఫిజికల్ లిటరసీ) సబ్జెక్టుకు కూడా ప్రతీ నెలా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లంకెలపాలెంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ నెల 28న జిల్లాలోని 7 నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. వ్యాయామ విద్య పురోభివృద్ధి, క్రీడా పోటీలు, క్రీడా నిబంధనల్లో వస్తున్న మార్పులపై ఈ సమావేశంలో చర్చిస్తామని వివరించారు. వ్యాయామ అక్షరాస్యతకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, లంకెలపాలేనికి చెందిన ఎం.వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎ.శేఖర్‌కు ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి రావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావును నియమించారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. నాగేశ్వరరావు నియామకంపై పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

త్వరితగతిన జగనన్న కాలనీల పూర్తి

- నునపర్తిలో నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వర్షంలో తడుస్తూనే జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అచ్యుతాపురం (అనకాపల్లి): జగనన్న హౌసింగ్ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. నునపర్తిలో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీని వర్షంలో తడుస్తూనే శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన ఇంట్లో ఉంటున్న కుటుంబంతో మాట్లాడారు. కాలనీకి అవసరమైన ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. 2004లో పట్టాలు పొంది వెబ్‌ల్యాండ్ నమోదు కాని 70 మంది లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని అక్కడి వారు కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాల నిర్మాణాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్, నడింపల్లి ఎలిమెంటరీ పాఠశాల, జి.పి.అగ్రహారంలో తాగునీటి సమస్యల గురించి స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ జోగినాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణ, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రుచి చూస్తే.. 'ఆహా' అనాల్సిందే..

- మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో తొలి క్యాంటీన్
- యలమంచిలిలో యూనిట్ ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘం
- తక్కువ ధరకే ఆహార పదార్థాలు
- క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి: అతివలు తలచుకుంటే ఏదైనా సాధ్యమే. తక్కువ ధరలకే ఆహార పదార్థాలు అందించాలన్న ఆలోచనతో క్యాంటీన్‌కు శ్రీకారం చుట్టారు. వారికి మెప్మా అండగా నిలిచింది. వారి తోడ్పాటుతో డ్వాక్రా సంఘం మహిళలు ఏర్పాటు చేసిన 'ఆహా' క్యాంటీన్‌ను ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) శనివారం యలమంచిలిలో ప్రారంభించారు. డ్వాక్రా సంఘం మహిళలు ఒక యూనిట్‌గా ఏర్పడి ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పథకం ద్వారా వచ్చే నగదుతో ఈ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ కూడా సహకారం అందిస్తోంది. ఈ క్యాంటీన్ ద్వారా కూర, సాంబారు, పెరుగు, అప్పడంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. టిఫిన్లు, వెజ్ బిర్యానీ విక్రయిస్తున్నారు. పట్టణం నడిబొడ్డులో 13వ వార్డు సచివాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ తక్కువ ధరతో మంచి భోజనం పెడుతుండటంతో అధిక సంఖ్యలో పట్టణ ప్రజలు ఆసక్తి కనబరిచారు. లెమన్ రైస్, టిఫిన్ రూ.20లకు, భోజనం రూ.45లకు, బిర్యానీ రూ.35లకు అందిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతం

మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మతో కలసి క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చక్కని అవకాశం కల్పిస్తున్నారన్నారు. వడ్డీ లేని రుణాలు, వైఎస్సార్ ఆసరాతో మహిళలు చిన్నతరహా పరిశ్రమల స్థాపించేందుకు, ఆర్థికంగా మరింత ముందుకు సాగేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, మెప్మా సిబ్బంది పద్మావతి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు..
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్,
రామాటాకీస్ దరి రీజనల్
కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

కరుణించిన వరుణుడు

- రైతాంగానికి ఊరటనచ్చిన వర్షాలు



గొలుగొండలో కురుస్తున్న వర్షం

తుమ్మపాల: జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి ఊరట కలిగించాయి. పల్లపు ప్రాంతాలలో వరినాట్లు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షాలు లేక ఎండిపోతున్న వరినాట్లకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయింది. ఈ నెల 25 ఉదయం నుంచి 26వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా మొత్తం 456.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు తెలిపారు. సగటు వర్షపాతం 19 మి.మీ. ఉందన్నారు. గొలుగొండ మండలంలో శనివారం తెల్లవారుజామున మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ధారగెడ్డ, బోరింగ్ గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహించింది.

ధారగెడ్డ ప్రాంతంలో వేసిన వరినాట్లకు ప్రాణం పోసింది. వరితో పాటు సరుగుడు, చెరకు, ఆగాకర సాగుకు ఈ వర్షం ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ వరి సాగుకు ఉపక్రమించే తరుణంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుత వర్షాలు వరి నాట్లతోపాటు ఉడుపులకు ఉపకరిస్తాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ మండలాల్లో వర్షపాతం (మి.మీ.)

అనకాపల్లి	46.4	రోలుగుంట	19.2
కశింకోట	40.2	కోటవురట్ల	18.4
మునగపాక	36.8	మాకవరపాలె	12.6
కె.కోటపాడు	35.4	అచ్యుతాపురం	12.2
నర్సీపట్నం	34.8	చీడికాడ	11.4
యలమంచిలి	23.2	చోడవరం	11.4
గొలుగొండ	22.4	రావికమతం	10.8
పాయకరావుపేట	19.6		

క్లుప్తంగా

138 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్టు
- 2 వాహనాలు, రూ.1.02 లక్షలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం



గంజాయితోపాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు చూపుతున్న సీఐ రమణయ్య

నర్సీపట్నం: జి.మాడుగుల నుంచి బొలేరో వాహనంలో గంజాయి తరలిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య శనివారం తెలిపారు. నర్సీపట్నం మండలం నెల్లిమెట్ట వద్దకు తీసుకువచ్చి ఏడు గోనె సంచులతో ఎర్టికా కారులోకి ఎక్కిస్తున్నారని తెలిపారు. రూరల్ ఎస్సై రామారావు, సిబ్బంది వారిని పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులు విజయవాడకు చెందిన ముక్కు శ్రీకాంత్(27), రాజమండ్రి టేపర్తి శ్రీనివాస్(25), జి.మాడుగుల మండలం వంజిరి గ్రామం కొర్రా శివ నారాయణ(36), హైదరాబాద్ మాదుగాని మహేష్(27), పంచువాలి శివసింగ్(22), తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన టేపర్తి జగదీష్(36)లను అరెస్టు చేశామన్నారు. రూ.11 లక్షలు విలువ చేసే 138 కిలోల గంజాయి, రూ.1,02,600, ఏడు సెల్ ఫోన్లు, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు

- ఆ దిశగా చర్యలు తీసుకుంటే సిజేరియన్ల తగ్గుదల
- వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: డాక్టర్ల పర్యవేక్షణలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎక్కువగా ప్రసవాలు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడం వల్ల సిజేరియన్లు తగ్గుతాయన్నారు. కష్టతరమైన కాన్పుకు అవకాశం ఉండే గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తీసుకురావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే స్టాఫ్‌నర్సు, ఆశా కార్యకర్త వారికి ముందస్తు చికిత్సలు, ముందస్తు జాగ్రత్తల గురించి పూర్తి అవగాహన కలిగించాలన్నారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటే సుఖప్రసవాలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తగిన చికిత్స, పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ కేసులకు ఎక్కువ శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఏ హేమంత్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాల్సిందే ....

బడిఈడు (5 నుంచి 18 ఏళ్లలోపు) పిల్లలు బడిలోనే చదువుతూ ఉండాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన విద్యా శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించి జీఈఆర్ (గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియో) (స్థూల నమోదు నిష్పత్తి) శతశాతం ఉండాలన్నారు. ప్రతి ఊరిలో బడిఈడు పిల్లల సంఖ్య ఆధారంగా వారు ఎక్కడ చదువుతున్నారో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంఈవోలు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీలు క్షుణ్ణంగా పరిశీలించి కచ్చితమైన సమాధానాన్ని ఈ నెల 30వ తేదీలోగా తెలియజేయాలన్నారు. ప్రతి ఊరిలో విద్యార్థుల పూర్తి సమాచారం వెల్ఫేర్ సెక్రటరీల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. అన్ని స్థాయుల్లో విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి మంజులావాణి, డీవైఈవో సుజాత, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో రవిబాబు, ఎంఈవోలు పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక నిధులు

- స్కూల్ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పిసినికాడలో రూ.20.39 లక్షలతో ఆధునికీకరించిన ఎంపీపీ స్కూల్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా రంగానికి అధిక నిధులు కేటాయిస్తోందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పిసినికాడలో రూ.20.39 లక్షల మనబడి నాడు – నేడు నిధులతో ఆధునికీకరించిన ఎంపీపీ స్కూల్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న దృక్పథంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొక్కవోని పట్టుదలతో నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు కోట్లాది రూపాయలను మంజూరు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు మేలు జరుగుతోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ యల్లపు రమేష్, ఎంపీటీసీ మొల్లేటి శివాజీ పాల్గొన్నారు.

నాడు మైనర్ బాలిక..నేడు మేజర్

- రెండేళ్ల క్రితం బాలికను లోబరుచుకుని అస్సాం తీసుకువెళ్లిపోయిన నిందితుడు
- కిడ్నాప్ కేసు నమోదు
- ఈ నెల 25న భువనేశ్వర్‌లో పట్టుకున్న పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సుబ్బరాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు, చిత్రంలో పోలీసు అధికారులు, నిందితుడు ప్రసాద్‌బాబు

అనకాపల్లిటౌన్ : రెండేళ్ల క్రితం ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్టు డీఎస్పీ బి.సుబ్బరాజు చెప్పారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. మండలంలో తగరంపూడి గ్రామానికి చెందిన మైనర్ బాలిక 2021 జూలై 13న రాత్రి నుంచి కనిపించడం లేదంటూ ఆమె తండ్రి నడిగట్ల శ్రీను ఫిర్యాదు మేరకు అదే నెల 15న గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు అందింది. అస్సాం రాష్ట్రం గౌహతి నుంచి ఎలుసూరి ప్రసాద్ బాబు అనే వ్యక్తి తగరంపూడిలో తన స్నేహితుని ఇంటికి వచ్చాడు. స్నేహితుడి ద్వారా పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ఓ మైనర్ బాలిక పరిచయం కావడంతో ఆమెను లోబర్చుకున్న ప్రసాద్ బాబు అస్సాంకు తీసుకెళ్లిపోయాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో నిందితుడి కోసం రెండేళ్లుగా కోల్‌కత్తా, ఒడిశా, తెలంగాణతో పాటు విశాఖపట్నం పలు ప్రాంతాల్లో గాలించారు. ఎట్టకేలకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ సమీపంలో ఒక మారుమూల గ్రామంలో మైనర్ బాలికతో కలిసి ప్రసాద్‌బాబు ఉన్నట్టు తెలుసుకున్న ఐటీ కోర్ బృందం ఈ నెల 25న అతడిని భువనేశ్వర్ చందక పోలీస్‌స్టేషన్‌లో హాజరుపరిచి అక్కడ నుంచి అనకాపల్లికి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. మైనర్ బాలిక ప్రస్తుతం మేజర్ కావడంతో చైల్డ్ వెల్ఫేర్ అధికారుల సహకారంతో వైద్యపరీక్షలకు తరలించి కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందని చెప్పారు. నిందితుడిని ఈనెల 25న భువనేశ్వర్‌లో అరెస్టు చేసినట్టు డీఎస్పీ చెప్పారు. ప్రసాద్‌బాబుకు గతంలో వివాహమై ఒక పాప ఉంది. అతని తల్లిదండ్రులు గౌహతిలో ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడికి కొద్ది దూరంలో కోడలు కూడా నివసిస్తోంది. నిందితుడ్ని శనివారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో గ్రామీణ సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐ సీహెచ్. నర్సింగరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ హెచ్‌సీ ఎస్.వి.రామకృష్ణ, రూరల్ కానిస్టేబుళ్లు పి.నరేంద్రకుమార్, ఎం.నరేష్, ఐటీకోర్ సిబ్బంది మూర్తి, దిలీప్, గ్రామీణ హెచ్‌సీ జె.రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల మృతికి కారణం డయేరియా!

- ఒడిశా వైద్యశాఖ నివేదిక
- మరో కార్మికుడు కూడా మృతి చెందినట్టు సమాచారం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల ముగ్గురు కార్మికుల మరణానికి కల్తీ మద్యం లేదా కలుషిత ఆహారం కారణమని అనకాపల్లి జిల్లా వైద్య శాఖ భావిస్తుండగా.. డయేరియా వల్లే వారు మరణించారని ఒడిశా వైద్య శాఖ నివేదికలో పేర్కొంది. దుప్పుతూరు లేబర్ క్యాంప్‌లో తలదాచుకున్న ముగ్గురు ఒడిశా వలస కార్మికులు పది రోజుల క్రితం అస్వస్థతకు లోనై ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారే కాక మరో కార్మికుడు కూడా మృతి చెందాడని, ఈ నలుగురు మృతికి డయేరియా కారణమని ఇక్కడి నుంచి విచారణకు వెళ్లిన స్థానిక పోలీసులకు ఒడిశా యంత్రాంగం తెలిపింది. కోరాపుట్ జిల్లా ముర్కార్‌కు చెందిన జాగా మినియకా (45)తోపాటు ఏడుగురు అచ్యుతాపురం సెజ్‌లో పనిచేసేందుకు కాంట్రాక్టర్ ద్వారా దుప్పుతూరు లేబర్ క్యాంప్‌కు వచ్చారు. అప్పటికే మూడు నెలల నుంచి ఉంటున్న కొందరు కార్మికులతో కలిసి క్యాంప్‌లో ఉంటున్న వారంతా 16వ తేదీ నుంచి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు లోనయ్యారు. ఈ నెల 17న క్యాంపులోనే మినియాకా మృతి చెందగా.. ఒడిశా రాష్ట్రం నబర్‌నాగ్‌పూర్ జిల్లా చలన్‌గూడ గ్రామానికి చెందిన పద్మన్ శాంత (26) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఒడిశా రాష్ట్రం బాలంగీర్ జిల్లా సింగరముండ గ్రామానికి చెందిన సురేందర్ కార్సిల్ (38) రైలులో స్వస్థలానికి వెళుతూ మార్గం మధ్యలో చనిపోయాడు. రైలులో మృతి చెందిన కార్సిల్ వ్యవహారంపై ఒడిశా అధికారులు స్పందించి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లా వైద్యశాఖ ద్వారా అచ్యుతాపురం పీహెచ్‌సీ అధికారులకు సమాచారం పంపించి అసలు ఏం జరిగిందో తెలుసుకోమని సూచించారు. కల్తీ మద్యం/ఫుడ్ పాయిజన్ కారణంతో ముగ్గురు చనిపోయారని ఇక్కడి అధికారులు నివేదిక పంపించారు. మనియక పురుషోత్తం(20) అనే మరో కార్మికుడు కూడా ప్రాణాలు కోల్పోయాడని, ఈ నలుగురి అస్వస్థతకు డయేరియా కారణమని ఒడిశా వైద్య శాఖ స్పష్టం చేయడంతో కార్మికుల మృతి మళ్లీ చర్చనీయాంశమైంది. వలస కార్మికుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

నేడు రామభద్రపురం, బీఆర్‌టీ కాలనీలో గడప గడపకు..

అనకాపల్లిటౌన్: మండలంలోని పిసినికాడ పంచాయతీ పరిధిలో బీఆర్‌టీ కాలనీ, రామభద్రపురం గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆర్టీసీ స్థలాల్లో దుకాణాల నిర్వహణపై అవగాహన రేపు

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ)కు చెందిన ఖాళీ స్థలాల్లో దుకాణాల నిర్వహణపై ఈనెల 28వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ మేడపైన జిల్లా పీటీడీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో 6,290 చదరపు గజాల్లో వ్యాపారాలు నిర్వహించే విషయమై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో శనివారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జల్లులు పడ్డాయి. ఈ వర్షం వ్యవసాయానికి ఉపయోగపడుతుందని అన్నదాతలు తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



వార్షికోత్సవాల్లో ఆటలాడుతున్న విద్యార్థులు

మునగపాక : వాడ్రాపల్లిలో స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. 12వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 28న బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, చక్రవర్తి, కన్నుంనాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 187 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,320	4,330
రెండో రకం	4,030	4,150
మూడోరకం	3,500	4,020

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బేదురులంక 2012	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-13 యూనిట్లు, ఒ పాజిటివ్ 19 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 326 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పిసినికాడలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: చరిత్రలో ఎన్నడూ చూడని సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చూస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.మండలంలోని పిసినికాడలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఏఏ పథకాల ద్వారా ఎంత లబ్ధిని చేకూర్చిందో తెలియజేసి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్ నిలిచారని తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరైన సంక్షేమ పథకాలు అందని వారుంటే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేలా చూడాలని అధికారులు,వలంటీర్లను మంత్రి ఆదేశించారు. నవరత్నాలు పథకాల వల్ల పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు.ప్రజలకు ఇంతటి మేలు చేస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లోనూ మద్దతునివ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం పార్టీలు అన్న తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ఆదేశం

తమకు తాగునీరు సక్రమంగా అందడంలేదని, సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. పైప్‌లైన్‌కు కొందరు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని వాడుకుంటున్నట్టు వారు చెప్పారు. దీనిపై స్పందించిన అమర్‌నాథ్ అక్రమంగా అమర్చిన మోటార్లను వెంటనే తొలగించి నీటి సరఫరాకు అవాంతరాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తమకు ఇళ్లు మంజూరు చేయాలని కొందరు గ్రామస్థులు కోరారు.అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు,పిసినికాడ గ్రామ సర్పంచ్ యల్లపు రమేష్, ఎంపీటీసీ మొల్లేటి శివాజీ, మాజీ సర్పంచ్ రాము,మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడి ప్రసాద్,కోటి,ఎంపీడీవో కె.వి. నరసింహరావు, తహసీల్దార్ గంగాధరరావు, మండల వ్యవసాయాధికారి రంగాచారి, ఏపీవో సుప్రియ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

- ఆర్డీవో చిన్నికృష్ణ



పిసినికాడ జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ చెప్పారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని పిసినికాడ జగనన్న కాలనీని ఆయన శనివారం సందర్శించారు. కాలనీలో 54 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటివరకూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 10 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని,వీటిలో ఆరు ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగాయని అధికారులు ఆర్డీవోకు తెలిపారు. కాలనీలో నివసిస్తున్న కుటుంబాలతో మాట్లాడిన ఆర్డీవో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా అందుతున్నాయో?లేదో? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా రుణం రూ.35 వేలు మంజూరులో ఏవైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని అడిగారు. ఇళ్లన్నింటికీ ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చారో లేదో తెలుసుకున్నారు. విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని అక్కడ లబ్ధిదారులు కోరగా తక్షణమే దానిని పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.ఇందుకు అవసరమైన డిపాజిట్ మొత్తాన్ని గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని సూచించారు.నేరుగా రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, కాలనీ నుంచి మెయిన్ రోడ్డుకు అంతర్గత రహదారి ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం గడువులోగా పూర్తి అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి. నరసింహరావు,గృహ నిర్మాణ శాఖ ఏఈ మురళి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్,ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగభూషణ్

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మదర్ థెరిసా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో గల విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భాగ్యులు, అనాథలు, కుష్టు రోగులకు థెరిసా ఎనలేని సేవలందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, పొట్టిశ్రీరాములు భవన నిర్మాణ కమిటీ వ్యవస్థాపకుడు పీరట్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మదర్ థెరిసా విగ్రహానికి అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కొణతాల రాజు, కర్రి నిఖిల్, కోన శివకృష్ణ, వల్లిరాజు, పి.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్‌పై దృష్టి పెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న విశ్వాంజలి

అనకాపల్లిటౌన్: ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు కరెంట్ అఫైర్స్, లేటెస్ట్ అప్ డేట్స్ కోసం నిత్యం దినపత్రికలను చదవాలని ఐఎఫ్‌ఎస్ అధికారి విశ్వాంజలి అన్నారు. స్థానిక 'డైట్' కళాశాలలో సివిల్‌సర్వీసెస్ ఉద్యోగాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలతోపాటు, ప్రస్తుత పరిస్థితులపై పట్టు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. నాణ్యత గల విద్యనందించడంతోపాటు వారి అభిరుచులను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ కళాశాల అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఎదగాలన్నారు. కెరియర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ పల్లా వెంకటమురళి మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తోడపెద్దు అచ్చుపోత ఉత్సవం



కశింకోటలో తోడపెద్దుల సేవ ఊరేగింపు

కశింకోట: స్థానిక దేవర వీధిలో తోడపెద్దు అచ్చుపోత ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అక్కడి తోడపెద్దు మృతి చెందడంతో కొత్తగా మరో ఎద్దును ఎంపిక చేసి సంప్రదాయంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతిల ఆధ్వర్యంలో శనివారం అచ్చుపోత కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం జిల్లాలోని ఎనిమిది గ్రామాల నుంచి వచ్చిన తోడపెద్దులతోపాటు అచ్చుపోత తోడపెద్దును భజనలు చేస్తూ, పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా తోడపెద్దులను ప్రజలు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ నూతన వస్త్రాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

165 'స్పందన' సమస్యల పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

కశింకోట: మండలంలో గత నాలుగు నెలల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలలో 165 సమస్యలను పరిష్కరించినట్టు మండల ప్రత్యేక అధికారి రోజారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మే 9 నుంచి ఇప్పటి వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 267 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. వీటిలో ఇంకా 102 సమస్యలు పరిష్కరించవలసి ఉందని తెలిపారు. అర్జీదారులు సమస్యల పరిష్కారం కోసం ముందుకు వస్తే ఈకేవైసీ చేస్తామన్నారు. కశింకోట వడ్డివీధి, వెదురుపర్తిలో భూముల వివాదాలు, ఇతర సమస్యలపై అందిన ఫిర్యాదుల పరిష్కారానికి రెండు వర్గాలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తహసీల్దార్ జి. సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఏవో ఎ.ఎ. ఖాన్, ఉప తహసీల్దార్ సురేష్‌కుమార్ హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లోగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్



సమావేశానికి హాజరైన గృహయజమానులు

అనకాపల్లిటౌన్: జాతీయ రహదారి తోటాడ జంక్షన్ నుంచి నూకాంబిక అమ్మవారి ఆలయ మీదుగా పవన్ సిటీసెంటర్ వరకు రహదారి విస్తరణ పనులను 15 రోజుల్లో ప్రారంభించనున్నట్టు జీవీఎంసీ టీపీవో జనార్థన్‌రావు తెలిపారు. స్థానిక గవరపాలెం పెద్దరామస్వామి ఆలయంలో శనివారం గృహ యజమానులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2.20కిలో మీటర్ల పొడవున 60 అడుగుల వెడల్పుతో జరిగే ఈ రహదారి విస్తరణలో 210 గృహాలను తొలగిస్తామని చెప్పారు. పాతపద్ధతిలో మార్కింగ్ చేసిన ప్రకారం రహదారి విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. గృహ యజమానుల సహకారంతో వచ్చే ఏడాది జనవరిలోగా పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సదస్సులో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్‌లు మాట్లాడుతూ అందరి ఆమోదంతోనే రోడ్డు విస్తరణ జరుగుతుందని, నష్టపరిహారం చెక్కులు హక్కుదార్లకు అందించిన తర్వాతే విస్తరణ చేపట్టనున్నట్టు చెప్పారు. రహదారి విస్తరణతో అనకాపల్లిలో నూకాంబిక దేవస్థానంతోపాటు పలు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్డు విస్తరణ ప్రాథమిక ప్లాన్‌ను అందరికీ వివరించారు. అమ్మవారి జాతరలోపే ఈ రహదారి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 80, 81వవార్డుల ఇన్‌చార్జులు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, బొడ్డేడ అప్పారావు, బొడ్డేడ శంకరరావు, గృహయజమానులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే దిశా యాప్



నక్కపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శిరీష

నక్కపల్లి : మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం దిశ చట్టాన్ని ప్రవేశపెట్టిందని సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నక్కపల్లి ఎస్ఐ శిరీష తెలిపారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జ్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నక్కపల్లి గురుకుల పాఠశాల లో విద్యార్థినులకు, జీడిపిక్కల పరిశ్రమలో పనిచేసే కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయి. వాటిని ఎలా గుర్తించాలి, ఎలా ఎదుర్కోవాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలనే దానిపై వివరించారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, నేరస్థల పరిరక్షణ, ఆపదలో ఉన్న సమయంలో ప్రభుత్వం రూపొందించిన దిశా చట్టం, మొబైల్ యాప్, దిశా యాప్ ఉపయోగం, దిశ పోలీసులకు ఏవిధంగా సమాచారం అందించాలో అవగాహన కల్పించారు. దిశా యాప్‌ను ఉపయోగించుకుని ఆపదలో ఉన్న వారు ఎలా తమను తాము కాపాడుకున్నారనే విషయాలను తెలియజేశారు. ఈ యాప్ వల్ల ఆపదలో ఉన్నవారి వద్దకు క్షణాల్లో పోలీసులు రాగలుగుతున్నారన్నారు. ఈవ్‌టీజింగ్, మైనర్ డ్రైవింగ్స్‌పై అవగాహన, మహిళా చట్టాలు గురించి తెలియజేశారు. టోల్ ఫ్రీ నంబర్లు 100, 112 గురించి తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు, వారి నుంచి అప్రమత్తత, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించడం వంటి అంశాలను వివరించారు. దొంగ సొత్తును కొనుగోలు చేయడం వల్ల ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. పోలీసు చట్టాలను తెలిపి, వాటిని ప్రజలు ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలియేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, జీడిపిక్కల ఫ్యాక్టరీ మేనేజర్ వాసు క్రైమ్ స్పాట్ సిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుమ్మపాల రైతు సంఘం కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేసిన రైతు సంఘం కొత్తపాలకవర్గం సభ్యులు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల వ్యవసాయదారుల రైతు సంఘం కొత్త కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీలా తారక రామారావు,కార్యదర్శిగా పెతకంశెట్టి బలరాం, కోశాధికారిగా పీలా మురళి, ఉపాధ్యక్షులుగా కొణతాల శేఖర్, కొణతాల రాజు, సహాయ కార్యదర్శులుగా బుద్ద జగ్గ అప్పారావు, కొణతాల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా కొణతాల జ్యోతి, రామకృష్ణ, వెంకట రమణ, అప్పారావు, బుద్ద రమణ, దాసరి శ్రీను, వెలగా భాస్కర నర్సింగరావు, వెలగా మోదునాయుడు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం వీరు ప్రమాణస్వీకారం చేశారు. సంఘం భవనాన్ని పునర్నిర్మించాలని కొత్తపాలకవర్గ సభ్యులు తీర్మానించారు. భవననిర్మాణం కోసం తన వంతుగా కొలపర్తి శ్రీను రూ.5లక్షల విరాళం ప్రకటించారు. కొత్త పాలకవర్గ సభ్యులను తుమ్మపాలకు చెందిన పలువురు సత్కరించారు. అన్నపూర్ణ బ్యాంకు అధ్యక్షుడు పి.డి. గాంధీ, మండల వైస్‌ప్రెసిడెంట్ విల్లూరి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పీఎం కిసాన్ జిల్లా కన్వీనర్ మురళీ, కొణతాల శ్రీనివాసరావు, ఆడారి గోవిందరావు, దొడ్డి సత్య అప్పారావు, చదరం ఆదినారాయణ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

తుమ్మపాల: మొబైల్ అంబులేటరీ వెటర్నరీ క్లినిక్‌ల ద్వారా రైతుల ఇంటి ముంగిటే సేవలందిస్తున్న వైద్యులతో పాటు సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించాలని, రిస్క్ అలవెన్స్, జీతాలు పెంచాలని కోరుతూ సిబ్బంది కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టికి వినతి పత్రం అందజేశారు. డాక్టర్లు నిఖిత, పృధ్వీ, హరిత, ఎం.అశోక్, కె.ప్రసాద్, వనజ, మోహన్ రామారావు, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, సింహాద్రప్పడు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

మునగపాక : తిమ్మరాజుపేట దళితవాడలో శనివారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, జెడ్‌పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ మంగలక్ష్మి,ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగి పడి ఆరు మేకల మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మేకలతో బాధితుడు

ఎస్.రాయవరం : గుడివాడ శివారు కొబ్బరితోటలో విద్యుత్ షాక్ కు గురై ఆరు మేక లు మృతి చెందినట్టు బాధి తుడు దార్ల వాసు తెలిపాడు. మేకలు పెంచుకుంటున్న తాను రోజూవలే మేతకు తీసుకు వెళ్లానని, కొబ్బరి తోటలో విద్యుత్ వైరు తెగిపడి, విద్యుత్ ప్రవహిస్తుండడంతో మేకలకు షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాయని, దీంతో తాను సుమారు లక్ష రూపాయలు నష్టపోయానని తెలిపారు. ఘటనపై కొరుప్రోలు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నాడు.


నారుమడుల్లో కలుపు యాజమాన్యం తప్పనిసరి



రమణయ్యపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

నక్కపల్లి : మండలంలో కురుస్తున్న వర్షాలకు ఉడుపులు ప్రారంభమయ్యాయని, అయితే కలుపులో యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన గుల్లిపాడు, ముకుందరాజుపేట, రమణయ్యపేటలలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. రైతుల నారుమళ్లను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్య 4నుంచి 5 మొక్కల చొప్పున నాటుకోవాలన్నారు. నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం అదనంగా పెంచి మూడు దఫాలు కాకుండా రెండు దఫాల్లో 70 శాతం దమ్ములో మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలన్నారు. వరి నారు మడుల్లో అక్కడక్కడ గుంపులు గుంపులుగా నారుమడి చనిపోతుందని, ఇది పొడతెగులు లక్షణమని తెలిపారు. ఈ తెగులు ఉధృతి పెరగకుండా వెంటనే ప్రతి లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల చొప్పున హెక్సాకోనోజోల్ మందును కలిపి ఎకరా నారుమడికి పిచికారీ చేయాలన్నారు. ఇప్పటికే వరి ఉడుపులు పూర్తయి 15 రోజులు దాటిన పొలంలో అంబటి కాడ, తీగజాతి, తుంగ వంటి గడ్డిజాతి కలుపు మొక్కలు ఉన్నాయని వాటి నియంత్రణకు బిస్‌పైరిబ్యాక్ సోడియం కలుపు మందును 80 నుంచి 100 మిల్లీలీటర్ల చొప్పున, అలాగే ఆల్‌మిక్స్ 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంపై పిచికారీ చేయాలన్నారు. వరిపొలంలో 20 రోజుల లోపు ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున కాలి బాటలు తీసుకోవాలన్నారు. తద్వారా గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. వరి ఉడిచేటప్పుడు ఎరువులు వేయని వారు ఎకరానికి ఒక బస్తా డీఏపీ, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సత్యనారాయణ, రాజేష్, రుఫియా తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



గొరుపూటి రాము

కశింకోట: మండలంలోని చెరకాం గ్రామంలో ఓ యువకుడు అదృశ్యమైనట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. బ్రాండిక్స్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్న గొరుపూటి రాము(30) ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లేకపోవడంతో అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. రాముకు వివాహం జరిగినట్టు ఆయన చెప్పారు.

సాగునీటి కాలువల ఆక్రమణలపై ఫిర్యాదు



సాగునీటి కాలువల ఆక్రమణలపై డీఎల్‌డీవోకు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘ అధ్యక్షుడు మహేష్

మునగపాక : మునగపాకలో సాగునీటి కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ డీఎల్‌డీవో మంజులావాణిని కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం సాయంత్రం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారమవుతాయని డీఎల్‌డీవో తెలిపారు. ఏఎస్ఐ దొర, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఈవోఆర్డీ ఈశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.